సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 14 । డిసెంబర్ । 2023



అఖండ అన్నసమారాధన

పెనుమంట్ర: జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం అయ్యప్పస్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.



చామంతి పూలతో పుష్పోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారితోటలోని బాలత్రిపుర సుందరిదేవి దేవస్థానంలో అమ్మవారికి బుధవారం 50 కేజీల చామంతి పూలతో పుష్పోత్సవం నిర్వహించారు.



శ్రీవారి ట్రస్ట్‌కు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు పెనుమంట్ర మండలం వెలగలేరుకు చెందిన గుడిమెట్ల వీర్రెడ్డి బుధవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మాణ పనులకు చెందిన కాంట్రాక్టర్‌కు చెల్లించే సొమ్ములో 1% లేబర్ సెస్‌ను భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి ఆదేశించారు. లేబర్ సెస్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో 2014 నుంచి నేటి వరకు జరిగిన నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్స్ వాటి వివరాలు 15 రోజులలోగా ఉప కార్మిక కమిషనరు, ఏలూరు వారికి అందజేయాలని ఆదేశించారు. కార్మిక శాఖను నిత్యం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సంబంధిత సమాచారం ఎప్పటికప్పుడు తెప్పించుకొని డేటా బేస్ ఏర్పాటు చేసుకోవలసిందిగా సూచించారు.

ఆక్వా రైతులకు బ్యాంకు రుణం

భీమవరం: ఆక్వా రైతులకు మత్స్యశాఖ ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డులు(కేసీసీ) అందజేస్తున్నట్లు మత్స్యశాఖ ఏడీ ఎల్ఎల్ఎన్ రాజు చెప్పారు. కేసీసీ కార్డులు పొందిన రైతులకు ఎకరాకు రూ.3 లక్షల వరకు కేవలం 7 శాతం వడ్డీతో రుణాలు మంజూరుచేయిస్తామని తెలిపారు. రుణాలు పొందాలంటే రైతులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్, లైసెన్స్‌లతో బ్యాంకు రుణాలు పొందవచ్చని చెప్పారు.

ఆర్కిటెక్ట్ లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్): లేఅవుట్లు, భవన నిర్మాణ ప్లానులు తయారుచేసేందుకు కొత్త లైసెన్సుల జారీ, పాత లైసెన్సుల రెన్యువల్‌కు దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా పంచాయతీ అధికారి జీవీకె మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో లేఅవుట్లు, భవన నిర్మాణ ప్లాన్లు తయారు చేయడం, పర్యవేక్షించడం నిమిత్తం 2024 సంవత్సరానికి అర్హత కలిగిన ఆర్కిటెక్ట్ ఇంజనీర్లు, సర్వేయర్-1, సర్వేయర్-2లకు కొత్త లైసెన్సుల జారీ, పాత లైసెన్స్‌లు రెన్యువల్ చేస్తున్నట్లు తెలిపారు. భీమవరం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారంను ఉచితంగా పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను గురువారం నుంచి డిసెంబర్ 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. బుధవారం ఏలూరు జెడ్పీ సమావేశం మందిరంలో ఏలూరు డివిజన్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలకు సన్నద్ధం కావాలన్నారు. సచివాలయ పరిధిలో ఆసక్తి గల క్రీడాకారులు, యువతీ, యువకులను పోటీల్లో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి సచివాలయం నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ క్రీడాంశాల్లో 10 జట్లు పోటీ పడాలన్నారు. సచివాలయ స్థాయిలో విజేత జట్లు మండల స్థాయిలో పోటీపడి నియోజకవర్గ స్థాయికి చేరుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్ర ఏలూరు డివిజన్ డీఎల్‌డీఓ ఎబీవీపి లక్ష్మీ మాట్లాడుతూ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ల సహకారంతో ఆటల పోటీల స్కోర్ షీట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే మండల పరిషత్ అధికారుల ద్వారా సచివాలయాలకు క్రీడా పరికరాలు అందజేశామన్నారు. స్థానిక పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సైతం పోటీల నిర్వహణలో కీలకభూమిక పోషించాలని సూచించారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్ యాప్‌లో పలు అంశాల గురించి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సమావేశంలో పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



నరసాపురం : వలంధర్‌రేవులో వేకువజామున పూజలు చేస్తున్న భక్తులు

కార్తీకమాసం ముగిసిన సందర్భంగా బుధవారం వేకువజామున భక్తులు పోలి పాడ్యమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున గోదావరి నదీ తీరం, కాలువలు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి దీపాలు వదిలారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- సాక్షి నెట్‌వర్క్





పాలకొల్లు సెంట్రల్ : కాలువలో దీపాలు వదులుతున్న మహిళలు, ద్వారకాతిరుమల : శ్రీవారి పుష్కరిణి మెట్లపై పూజలు

కష్టంలో రైతన్నకు అండగా..

- తుపాను పంట నష్టం ప్రాథమిక అంచనాలు సిద్ధం
- ప్రభుత్వానికి నివేదిక అందించిన అధికారులు
- పూర్తి స్థాయి అంచనాల కోసం క్షేత్ర స్థాయిలోకి యంత్రాంగం
- 18వ తేదీ వరకు లెక్కింపు.. 22న ఆర్‌బీకేల వద్ద ప్రచురణ
- 26న కలెక్టర్ కార్యాలయానికి తుది జాబితా



ఏలూరు జిల్లాలో పంట నష్టం ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఏలూరు(మెట్రో): రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి కష్టంలో అండగా నిలబడ్డారు. పెట్టుబడి సాయం దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు వారికి అన్నివిధాల చేయూతనందిస్తున్నారు. రైతు ప్రభుత్వంగా సాగుతున్న వైఎస్ జగన్ సర్కారు ప్రకృతి విపత్తుల్లో రైతన్నకు బాసటగా నిలుస్తోంది. రైతన్నకు నేనున్నానంటూ పాలన సాగుతోంది. ఇటీవల కురిసిన తుపాను నేపథ్యంలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

26న తుది జాబితా : మిచాంగ్ విపత్తుతో దెబ్బతిన్న రైతులను ఇన్‌పుట్ సబ్సిడీ, బీమాతో గట్టెక్కించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. పక్కాగా లెక్క తేల్చేందుకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీలు క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాయి. పొలాల్లోకి వెళ్లి పంట నష్టం లెక్కిస్తున్నాయి. ఫీల్డ్ సర్వే, పబ్లికేషన్, సోషల్ ఆడిట్ అనంతరం 26న తుది జాబితా కలెక్టర్ కార్యాలయానికి చేరనుంది. తొలకరి చివరి దశలో ఈ నెల మొదటి వారంలో వచ్చిన తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 3 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు కురిసిన రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. ప్రభుత్వ ఆదేశాలతో ముందుగానే అప్రమత్తమైన అధికారయంత్రాంగం వర్షాలకు ముందే ఆఫ్‌లైన్‌లో కళ్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు చేర్చారు. పొలాల్లో ముంపునీరు లాగేందుకు జేసీబీలు, ఉపాధి కూలీలతో యుద్ధ ప్రాతిపదికన పలు డ్రెయిన్లు, పంట బోదెల్లో పూడిక తొలగించారు.

త్వరలో పూర్తి స్థాయి అంచనాలు

ప్రస్తుతం వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు పొలాల్లోనే రైతులకు వాటిల్లిన నష్టం అంచనాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖలు అందజేశాయి. పూర్తి స్థాయిలో పంట నష్టాలను అంచనా వేసేందుకు బృందాలు రంగంలోకి దిగి పని ప్రారంభించాయి. నష్టాల వివరాలు ప్రభుత్వానికి అందించనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన శాఖ నష్టాలు, వ్యవసాయ శాఖ నష్టాలను ప్రాథమికంగా లెక్కతేల్చారు. జిల్లాలో అరటి 319, మిర్చి 970, బొప్పాయి 18, టమాటా 45, కూరగాయలు 93, జీడిమామిడి 64, నిమ్మ, ఇతర పంటలు కలిపి మొత్తం 1800 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ఉద్యాన వన శాఖ అధికారులు అంచనా వేశారు. వరి 45,096, మొక్కజొన్న 11,563, మినుము 5,738, పెసలు 6,218, పత్తి 3,890, వేరుశెనగ 1,502, పొగాకు 11,417, చెరకు 2 ఎకరాల్లో మొత్తంగా 85,425 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా రూపొందించారు. ఈ అంచనా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు

పూర్తిస్థాయి నివేదిక అనంతరం నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వాల పాలనలో పంట నష్టం వాటిల్లిన తరువాత ఎప్పుడూ రైతులకు నష్టపరిహారం అందుతుందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం జగన్ సర్కారు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవించిన వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటుంది.

త్వరలో నష్టపరిహారం



ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి అందించాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పంట నష్టం అంచనాలు సమగ్రంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి అందించాం. పూర్తిస్థాయిలో పంట నష్టపరిహారాలు, పంట నష్టాలను అంచనా వేసి అనంతరం ప్రభుత్వ నష్టపరిహారాన్ని విడుదల చేసిన వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బి.లావణ్యవేణి, జేసీ, ఏలూరు

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 19న ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో బుధవారం సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్‌లోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియరు కాలేజీ వెనుక లేఅవుట్‌లో సభావేదికను, లూథరన్ హైస్కూలులో హెలిప్యాడ్‌ను జాయింటు కలెక్టరు ఎస్.రామసుందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సభావేదిక, హెలిప్యాడ్ స్థలాల్లో నేల చదును చేసి ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. హెలిప్యాడ్ గ్రౌండింగ్, సభాస్థలి ఏర్పాట్లు, వాహనాల పార్కింగు, బారికేడ్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ధ్యేయం



మొగల్తూరులో ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి కృషి చేస్తున్నారని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం మొగల్తూరు నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో యువతకు స్థానిక ఒకటో సచివాలయ ఆవరణలో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయని విధంగా ముఖ్యమంత్రి యువతను ఆటల వైపు మళ్ళించే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ నెల 15 నుంచి 50 రోజుల పాటు గ్రామ, మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా యువత దేశం, అంతర్జాతీయంగా పేరుగడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మీ, జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు, నాయకులు కర్రి ఏసుబాబు, లోకం నాని, పాలా రాంబాబు, కుక్కల కృష్ణమోహన్, బొక్కా నాగరాజు, రేవు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

భీమవరం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల 14 నుంచి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రంతో పాటు డివిజన్ విద్యుత్ కేంద్రాల్లో నిర్వహించే వారోత్సవాల్లో విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు ముగ్గుల పోటీలు ఏర్పాటుచేసి వారికి స్టార్‌రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యుత్ పొదుపు అవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై వర్క్‌షాపులు, విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై వినియోగదారులతో అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జనవిజ్ఞానవేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సాల్మన్‌రాజు తెలిపారు. విజేతలకు ఈనెల 20వ తేదిన నిర్వహించే వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేస్తామన్నారు.

ఆంజనేయ కలశ పూజా మహోత్సవం



మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలిలో బుధవారం రాత్రి ఆంజనేయ కలశ పూజ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తేతలి గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పీఠాన్ని సందర్శించి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం సభ్యులతో పాటు నాయకులు కోట స్వామిజీ, సరెళ్ల వీరతాత, భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీనుతో పాటు ఆంజనేయ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

ఏలూరు(మెట్రో): ఓటు ప్రాముఖ్యత, ఓటరు నమోదు గురించి జిల్లాలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు వినూత్న రీతిలో ఉండాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని నియోజకవర్గ ఎన్నికల ఈఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలు మండల స్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇప్పటివరకు ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి కాలేజీలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, వినూత్న రీతిలో ఉండాలని అర్బన్ ఏరియాలో ప్రత్యేకమైన వాహనం ద్వారా ఫ్లెక్సీలతో, మైకు ద్వారా ఓటరు నమోదు, ఓటు ప్రాముఖ్యత గురించి ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.

ట్యూషన్ ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ కోర్సులకు సంబంధించి విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఆఖరి అవకాశం కల్పించినట్లు సమన్వయాధికారి వీఎఎస్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజును రూ. 500 అపరాధ రుసుముతో ఈ నెల 31 లోపు చెల్లించవచ్చన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉన్నత శిఖరాలకు..

- కేఎల్ యూనివర్సిటీ, 'సాక్షి' ఆధ్వర్యంలో 'గమనం-గమ్యం'
- ఇంటర్ తర్వాత కోర్సులపై అవగాహన
- కేఎల్ వర్సిటీ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచనలు





జంగారెడ్డిగూడెంలో గమనం-గమ్యం కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న కేఎల్ వర్సిటీ డైరెక్టర్ శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం: నైపుణ్యాలు, సాంకేతిక ఆలోచనలను మెరుగుపరచుకోవడం ద్వారా విద్యార్థులు అత్యున్నత శిఖరాలకు చేరుకోవచ్చని కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు సూచించారు. ఇంటర్, డిగ్రీ కోర్సుల తర్వాత విద్యార్థులకు అవకాశాలు, లక్ష్యసాధన అంశంపై కేఎల్ యూనివర్సిటీ, 'సాక్షి' దినపత్రిక సంయుక్తంగా జంగారెడ్డిగూడెంలోని శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'గమనం-గమ్యం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సులపైనే ఆసక్తి చూపిస్తున్నారని.. అయితే ఎక్కడ చేరాలి, ఎలా చేరాలి, ఏ స్పెషలైజేషన్ తీసుకోవాలనే అనే అంశాలపై ఆందోళన చెందుతూ ఉంటారని అన్నారు. దేశంలో పలు ప్రైవేట్ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు అందుబాటులో ఉన్నాయని అయితే తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దగలిగే విద్యాసంస్థలను ఎంచుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్‌లో కోర్సుల ఎంపిక చేసుకున్నంత మాత్రాన ఏదో సాధించేశాం అనుకోవటం పొరబాటు అని, ఇంజనీరింగ్‌లోనే వివిధ స్పెషలైజేషన్‌లను ఎంచుకుని చదవటం ద్వారా అత్యధిక ప్యాకేజీలతో ఉద్యోగాలను పొందవచ్చని స్పష్టం చేశారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని సరిదిద్దుకోవాలని సూచించారు. మెరిట్ విద్యార్థులను కేఎల్ యూనివర్సిటీ పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తుందని, ఏటా రూ.100 కోట్ల మేర స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని చెప్పారు. ప్రవేశ పరీక్షల విషయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా, ఉత్సాహంగా ఉండాలని సూచించారు. ఉన్నత కోర్సుల విషయంలో విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ్‌కుమార్, శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్లు సింగిరెడ్డి సత్యనారాయణ, కె.నాగేశ్వరావు, శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, క్రమశిక్షణతో లక్ష్యసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా వెంకటేశ్వర విద్యాసంస్థల ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన పరేడ్, విన్యాసాలు అలరించాయి. అనంతరం విద్యాసంస్థలో అత్యుత్తమ మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్‌ను శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు బొబ్బిలి సత్యనారాయణమూర్తి, హెచ్ఎస్ఆర్ మూర్తి, మేనేజర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ కమిటీ నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ రాష్ట్ర విద్యార్థి విభాగం నూతన కమిటీ నియామకం జరిగింది. రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీలో ఏలూరు జిల్లాకు సంబంధించి జాయింట్ సెక్రటరీగా సింగిరెడ్డి నాగభరత్‌రెడ్డి, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి చిగురుపాటి సందీప్ రాష్ట్ర సెక్రటరీలుగా నియమితులయ్యారు.

రేషన్ బియ్యం సీజ్

ఏలూరు టౌన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన భవనంపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ యుజే విల్సన్ ఆధ్వర్యంలో అధికారులు సోదాలు చేశారు. కామవరపుకోటలో జంగారెడ్డిగూడెంకు చెందిన కొండూరు పళనికుమార్ రేషన్ బియ్యాన్ని పాతభవనంలో నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో దాడులు చేశారు. విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు తనిఖీ చేయగా 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం కామవరపుకోట పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొని కాకినాడ మండలం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన చోడిశెట్టి మహేష్‌కు అమ్ముతున్నట్లు తేలింది. తనిఖీల్లో రూ. 64 వేలు విలువైన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పళని కుమార్‌తో పాటు వ్యాపారంలో భాగస్వాములుగా ఉన్న షేక్ లాల్‌జాన్‌బాషా, మహేష్‌పై కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మంత్రి జోగి రమేష్ నేడు రాక

నరసాపురం: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ గురువారం నరసాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు. మొగల్తూరు మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కార్యాలయం బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 గంటలకు మంత్రి పట్టణంలోని ముదునూరి కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ జరిగే రహదారుల ప్రారంభ కార్యక్రమంలో ముదునూరితో కలసి పాల్గొంటారు. అనంతరం రామన్నపాలెం-1 సచివాలయం వద్ద జరిగే సభలో మాట్లాడతారు.

సోమేశ్వరస్వామి కార్తీక మాస ఆదాయం రూ.73.36 లక్షలు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసియున్న పంచారామక్షేత్రం శ్రీసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానం హుండీ ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కించారు. కార్తీక మాసం సందర్భంగా 28 రోజులకు గాను వివిధ రూపాల్లో రూ.73, 36,576 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.కృష్ణంరాజు చెప్పారు. పూజా టికెట్ల ద్వారా రూ.5,98,224, దర్శనం టికెట్ల విక్రయాల ద్వారా రూ.42,88,450, లడ్డూ విక్రయాల ద్వారా రూ.4,70,550, ఉచిత ప్రసాదాలకు విరాళాల ద్వారా రూ.15వేలు, హుండీ కానుకల ద్వారా రూ.19,64,352 కలిపి మొత్తం రూ.73,36,576 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ లెక్కింపులో ధర్మకర్తలు కుర్మదాసు సత్యశ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, కోయతాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పశువుల్లో 'గొంతువాపు' ముందే గుర్తించండి

- శీతాకాలంలో విజృంభిస్తున్న వ్యాధి
- పాడి పశువుల్లో తగ్గిపోతున్న పాల దిగుబడి
- టీకాలు అందిస్తున్న అధికారులు



గొంతువాపు సోకిన పశువు



కలిదిండిలో గేదెకు వాక్సిన్ వేస్తున్న పశువైద్యులు



కైకలూరు: మిచాంగ్ తుపాను కారణంగా వాతావరణంలో మార్పు, కలుషిత నీటిని తాగడం వల్ల పశువులకు వ్యాధుల బారిన పడుతుండటం పశుపోషకులను ఆందోళనకు గురిచేస్తోంది. చలిగాలులు వల్ల గాలిలో తేమశాతం పెరిగి పశువులకు శ్వాస సంబంధ వ్యాధులు, తీవ్ర చలి వల్ల పశువులు ఆహారాన్ని నమలలేకపోవడంతో అజీర్ణ వ్యాధులు, శిలీంద్రాల కారణంగా చర్మవ్యాధులు శీతాకాలంలో సంక్రమిస్తున్నాయి. దీంతో పాడి పశువుల్లో పాల దిగుబడి, వెన్నశాతం తగ్గుతోంది. ముఖ్యంగా పశువుల్లో గొంతు వాపు వ్యాధి సోకుతుండటంతో పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు.

ఏలూరు జిల్లాలో ఆవులు 1,36,549, గేదెలు 5,12,142, గొర్రెలు 5,26,836, మేకలు 1,98,810 ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో నానాటికి పగటి ఉష్ణోగ్రతలు తగ్గితున్నాయి. దోమలు, జోరీగలు, పిడుదులు, గోమార్ల ఉధృతి పెరుగుతోంది. పాడి పశువుల్లో గొంతువాపు వ్యాధి కలవరపెడుతోంది. పాశ్చురెల్లా హిమోలైటికా అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. బర్రెలతోపాటు ఆవులు, మేకలు, గొర్రెలలో ఇది కనిపిస్తుంది. ఈ వ్యాధి నివారణకు సరైన చర్యలు తీసుకోవడం ద్వారా పాడి పశువులను కాపాడుకోవచ్చని కైకలూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్ చెప్పారు. ఈ వ్యాధి నివారణకు పశుపోషకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

ఈ లక్షణాలు ఉన్నాయా..

వ్యాధి కారకాలు పశువుల శరీరంలోకి ప్రవేశించిన 8 నుంచి 32 గంటల వ్యవధిలో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. జ్వర తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఏ లక్షణం కనిపించకుండానే ఆకస్మికంగా మరణిస్తుంటాయి. మేత, నెమరు మందగించుట, పాలు నిలిచిపోవుట జరుగుతుంది. గొంతు కింది భాగంలో జలవాపు ప్రారంభమై క్రమంగా మెడ కింది భాగానికి, ఆ తర్వాత కాళ్ల మధ్య ఎదురు రొమ్ము కిందికి చేరుతుంది. పశువు తీవ్రమైన ఆయాసంతో రొప్పుతూ గురకపెడ్తూ ముక్కు నుంచి, నోటి నుంచి నురగ వంటి స్రావాలను కారుస్తుంటుంది. చెవి ప్రాంతంలో విపరీతమైన వేడి ఉంటుంది. కళ్లు ఎరగ్రా మారుతాయి. కొన్ని సందర్భాల్లో చాక్లెట్ రంగులో కనిపిస్తాయి. వ్యాధి కారక పశువులు గుర్రగుర్రమంటూ శబ్దం చేస్తాయి.

నివారణ చర్యలు ఇలా..

రక్త పరీక్ష చేయించి బైపోలార్ గ్రామ్ నెగెటివ్ బ్యాక్టీరియాను గుర్తించటం వల్ల వ్యాధిని నిర్ధారిస్తారు. పశువు చనిపోయిన తరువాత శవ పరీక్ష చేసి కూడా వ్యాధిని నిర్ధారించవచ్చు. దీని నివారణకు 30 మిల్లీ లీటర్ల సల్ఫాడిమిన్ మందులు 3 రోజుల పాటు రక్తంలో ఎక్కించాలి. చర్మం కింది కండకు కూడా మందును ఇంజెక్షన్ రూపంలో ఇవ్వవచ్చు. క్లోరంఫెనికాల్, ఆక్సిటెట్రాసైక్లిన్, సెఫ్ట్రైక్సోన్, సల్ఫా మందులను 15 మిల్లీ లీటర్ల మోతాదులో మూడు రోజుల పాటు కండకు ఇవ్వాలి. వాపు తగ్గటానికి కార్టిబోన్, జోబిడ్ వంటి మందులను 15 మిల్లీ లీటర్ల మోతాదులో ఇవ్వాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- తాగునీరు, కలుషిత వాతావరణం, అనారోగ్య పశువుల స్పర్శ, మేత, పరికరాలు, ఈగలు, జోరీగల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుంది. రైతులు పాకల వద్ద పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలి
- సకాలంలో సరైన చికిత్స అందించడంతోపాటు టీకాలు వేయించాలి. శరీరం లోపలి అవయవాల్లో కనిపించే మార్పుల వల్ల కూడా వ్యాధి నిర్ధారణ చేస్తే మరీ మంచిది
- వ్యాధికి గురైన పశువులకు బాగా విశ్రాంతి నివ్వాలి
- ఎన్రోఫ్లాక్సిసిన్, సిప్రోఫ్లాక్సిసిన్, జెంటామైసిన్స్ సల్ఫాపెన్సిలిన్ వంటి ఏదైనా యాంటీ బయోటిక్ ఇంజెక్షన్లను వరుసగా కనీసం మూడు నాలుగు రోజులు ఇవ్వాలి
- వ్యాధికి గురైన పశువును గుర్తించగానే మిగతా పశువులకు దూరంగా ఉంచాలి
- పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. పాడి సున్నం, గెమాక్సిన్, డీడీటీ, సైపర్‌మెథ్రిన్, డెల్టామెథ్రిన్ వంటి కీటకనాశకాలను పిచికారీ చేయాలి
- చనిపోయిన పశువుల కళేబరాలను, వాటి వ్యర్థాలను కొట్టాలకు దూరంగా భూమి లోతుగా తవ్వి పాతిపెట్టాలి.



డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్, ఏడీ, పశుసంవర్ధక శాఖ, కైకలూరు

స్పెయిన్ పోటీల్లో దండగర్ర విద్యార్థి పెయింటింగ్‌కు తృతీయం



విద్యార్థి నాగేశ్వరరావు వేసిన పెయింటింగ్

తాడేపల్లిగూడెం రూరల్: అంతర్జాతీయ స్థాయిలో స్పెయిన్ దేశంలో నిర్వహించిన ఆర్ట్ గ్యాలరీలో తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి అర్జుల నాగేశ్వరరావు వేసిన పెయింటింగ్‌కు తృతీయ స్థానం లభించింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న జరిగిన ఈ పోటీల్లో 24,662 పెయింటింగ్స్ రాగా, నాగేశ్వరరావు గీసిన చిత్రం తృతీయ స్థానం సాధించడంపై స్కూలు హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ బుధవారం హర్షం ప్రకటించారు. పెయింటింగ్ పోటీల ఫలితాలు మంగళవారం రాత్రి విడుదలయ్యాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాగేశ్వరరావును ఆయన అభినందించారు.

క్లాట్‌లో 'శ్రీషిర్డీ సాయి' విద్యార్థుల ప్రతిభ



క్లాట్‌లో ర్యాంకులు సాధించిన శ్రీషిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వివిధ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి నిర్వహించే క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)లో షిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య బుధవారం తెలిపారు. ఇంటర్‌తో పాటు డాఫ్నీ సివిల్స్ అకాడమీలో సివిల్స్, ఐపీ మాట్, సీయూ సెట్‌లలో శిక్షణ పొందుతున్న కటారి లాస్య ఆల్ ఇండియా 7వ ర్యాంకు, వేముల శ్రీహర్ష ఆల్ ఇండియా 8వ ర్యాంకు, కె.డిలాన్ ఎడ్వర్డ్ 16వ ర్యాంకును కైవసం చేసుకున్నారన్నారు. టి.చిన్న 51వ ర్యాంకు, జి.సాయినిత్య 58వ ర్యాంకు, వి.వందన 5వ ర్యాంకుతో ఆరుగురు విద్యార్థులు 100 లోపు ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. హాజరైన మొత్తం 55 మంది విద్యార్థులలో 36 మంది తొలి కౌన్సెలింగ్‌లోనే వివిధ న్యాయ విశ్వవిద్యాలయాల్లో న్యాయ విద్యను అభ్యసించడానికి అర్హత సాధించారన్నారు. అన్ని కౌన్సెలింగ్‌లలోనూ మొత్తం 42 మంది అర్హత సాధించే అవకాశం ఉందన్నారు. ఏటా తమ విద్యార్థులు వివిధ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు అర్హత సాధించడంపై శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులు, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర: ఆలమూరు రైస్‌మిల్లు వద్ద మంగళవారం అర్ధరాత్రి మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఓడూరుకు చెందిన ఎస్.దానయ్య, వైజాగ్‌కు చెందిన జి.రాజు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ బాలకృష్ణ, పైలెట్ మహేష్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, ఆసుపత్రికి తరలించారు.

త్రోబాల్ అండర్-19 జిల్లా జట్ల ఎంపిక



త్రోబాల్ జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో బుధవారం త్రోబాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అండర్-19 జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, జాయింట్ సెక్రటరీ ఎన్‌ఎం శ్రీనాథ్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో ఈ నెల 20, 21 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. జిల్లా జట్లకు ఎంపికైన బాలురు, బాలికలను అభినందించారు. బాలురు విభాగంలో బి.రవితేజ, జి.అశోక్, పి.నవీన్, ఎస్‌కే మోహన్ సాహెబ్, టి.భార్గవ్, వి.రాజు, మహేష్, బి.సాయి దుర్గాప్రసాద్, రత్నకుమార్, సుధీర్, ధరణికుమార్, టి.మనోజ్‌కుమార్, బాలికల విభాగంలో సీహెచ్ పల్లవి, పి.హర్షిత, బి.కృష్ణచాతుర్య, వి.శ్రీలత, ఎస్‌కే చంద్ బీ, ఎస్.మీనాక్షి, ఎం.కీర్తన, యశశ్విని, ఎ.దివ్యరత్నం, పి.నాగమౌనిక, ఎం.జ్ఞాపిక, ఆర్.శిరీషా ఎంపికయ్యారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై సాధిక్

ఏలూరు టౌన్: తప్పిపోయిన ఓ బాలుడిని ఏలూరు టూటౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక తంగెళ్లమూడికి చెందిన సైదులు కూలి పనులు చేస్తుంటాడు. సైదుల దంపతులకు నాలుగేళ్ల కుమారుడున్నాడు. బాలుడు మంగళవారం ఉదయం ఇంటి ముందు రోడ్డు మీదకు వచ్చి ఆడుకుంటూ తప్పిపోయాడు. కాసేపటికి గుర్తించిన తల్లిదండ్రులు బాలుడిని వెతికినా ప్రయోజనం లేకపోవటంతో ఏలూరు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎస్సై సాధిక్ వెంటనే స్పందించి తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు జంగారెడ్డిగూడెం రోడ్డులోని సమాధుల తోట సమీపంలో ఉండగా పోలీసులు గుర్తించి వెంటనే అతన్ని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పాలకొల్లు సెంట్రల్ : పూలపల్లిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారం, నగదు అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఇంట్లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వి.నాగవల్లి, ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. ఈ నెల 9వ తేదీన ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. 12వ తేదీ సాయంత్రానికి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం లేకుండా తలుపు దగ్గరకు వేసి ఉండడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, రెండు కాసులు బంగారం, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం నాగవల్లి పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ డి.రాంబాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.ముత్యాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి



నన్నయ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సుధాకర్‌ను సత్కరిస్తున్న చిత్రం

తాడేపల్లిగూడెం: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్ కోరారు. స్థానిక నన్నయ వర్సిటీ ప్రాంగణంలో యూజీ పీజీ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యపరివర్తన శక్తి, పరిశోధనల ప్రాముఖ్యం, శ్రేష్ఠమైన ప్రవర్తనల ఆవశ్యకతలపై వివరించారు. చదువు కేవలం డిగ్రీలు పొందడానికి కాకుండా విమర్శనాత్మకమైన ఆలోచన, సృజనాత్మకత, బాధ్యతాభావం కలిగి ఉండాలన్నారు. విభిన్న విద్యామార్గాలను అనుసరించడానికి, సవాళ్లను స్వీకరించడానికి విద్యార్థులు సన్నద్ధంగా ఉండాలన్నారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



శ్రీరంగపట్నంలో అగ్నికి ఆహుతైన తాటాకిల్లు

కొయ్యలగూడెం: అచ్యుతాపురం పంచాయతీ శ్రీరంగపట్నంలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని మానికల నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు బుధవారం మేకలను మేపుకోవడానికి బయటకు వెళ్లారు. ఆ సమయంలో మంటలు చెలరేగి తాటాకిల్లు దగ్ధమవుతుండగా, స్థానికులు మంటలు ఆర్పడానికి విఫలయత్నం చేశారు. అప్పటికే మంటలు తీవ్రమై ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియదని బాధితులు తెలిపారు. ఇటీవల డ్వాక్రా రుణం రూ.1లక్ష 19 వేలు, కాసున్నర బంగారం, 250 కేజీల బియ్యం అగ్నికి ఆహుతి అయ్యాయని వాపోయారు. ప్రమాద స్థలాన్ని తహసీల్దార్ పాసం నాగమణి, సర్పంచ్ మద్దిపాటి నాగమణి ఎంపీటీసీ మందపాటి కుమారి ప్రమాదాన్ని పరిశీలించి బాధితులను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

గడపగడపకు సంక్షేమం



యలమంచిలి : అబ్బిరాజుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

మామిడిలో పూత, పిందె రక్షణ ఇలా..



పూతతో ఉన్న మామిడి చెట్టు

పాడి-పంట

నూజివీడు: మామిడి సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే రైతులకు నష్టాల తప్పవు. మామిడి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు పలు యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుంది. నూజివీడు డివిజన్‌లో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వీటిలో ఎక్కువగా బంగినపల్లి, తోతాపురి (కలెక్టర్), పెద్ద రసాలు, చిన్నరసాలు వంటి రకాలను సాగుచేస్తున్నారు. మామిడికి రాత్రి సమయంలో అధిక చలి, పగలు వేడి వాతావరణం అనుకూలం. ఈ పరిస్థితుల్లో పూత, పిందెను రక్షించుకోవడానికి ఏం చర్యలు తీసుకోవాలనే అంశాలపై నూజివీడు మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి రైతులకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. వీటిని పాటించినట్లయితే పూత, పిందె రాలడాన్ని అరికట్టడంతో పాటు నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చని చెబుతున్నారు.

ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు మామిడి తోటలలో నిలిచిన వర్షపు నీటిని బయటకు మళ్లించాలి. నేల త్వరగా ఆరడానికి పైపైన రోటోవేటర్‌తో శుభ్రం చేసుకోవాలి. మామిడి తోటలకు కల్తార్ వాడి ముందుగా పూత రప్పించిన తోటలలో చాలా వరకు వచ్చిన పూత అంతా రాలిపోయింది. పూమొగ్గలు, పూతపైన పక్షికన్ను తెగులు, బూజు తెగులు ఆశించడానికి ఎక్కువ అవకాశం ఉంది. దీని నివారణకు కార్బండిజమ్ ఒక గ్రామ్ లేదా హెక్సాకోనజోల్, డైథేన్ ఎం 45 మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన చర్యలు..

- పూమొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించడానికి గాను డిసెంబర్‌లో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పూమొగ్గలు పెరుగుదల దశలో తేలికపాటి నీటి తడులు ఇచ్చినట్లయితే త్వరగా పిందెలు కడతాయి.
- నీటి ఎద్దడి వల్ల పోషకలోపాలు ఏర్పడటం, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడటం జరుగుతుంది. దీంతో పూత, పిందె రాలడం జరుగుతుంది.
- మామిడిలో పూత రాలడం సహజం, అయితే మొగ్గ పుష్పాలు, ఫలదీకరణ చెందని పుష్పాలు రాలిపోతాయి. పూత అధికంగా రాలుతున్నట్లయితే 1 ఎంఎల్ నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లం 20 పీపీఎం లేదా ప్లానోఫిక్స్ 1ఎంఎల్ ను 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మామిడిలో అధిక నష్టం కలిగించే చీడపీడలైన తేనె మంచు పురుగు, తామర పురుగుల నివారణకు రైతులు తగిన నివారణ చర్యలు చేపట్టాలి. తెల్లపూత దశలో ఏ మందులూ పిచికారీ చేయకూడదు.

సస్యరక్షణ ఇలా..

- తేనె మంచు పురుగు ఆశించి పూత నుంచి లేత చిగుళ్ల నుంచి రసం పీల్చడం వల్ల పూత రాలిపోతుంది. ఈ పురుగులు విసర్జించిన తేనె వంటి జిగురుపై మసి తెగులు వృద్ధి చెందుతుంది.
- తేనె మంచు పురుగు ఆశించినట్లయితే పూతదశలో పూలు విచ్చుకోవు. దీనికి గాను ఇమిడాక్లోప్రిడ్ మందు 0.3 ఎంఎల్ లేదా థయామిథాక్సమ్ 0.5 గ్రాములు లేదా క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 2.5 ఎంఎల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తామర పురుగుల ఉధృతి తెలుసుకోవడానికి తోటలలో జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. తామర పురుగు మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- తామర పురుగుల బెడద అధికంగా ఉంటే స్పైనోసాడ్ 0.25 ఎంఎల్, థయోమిథాక్సామ్ 0.05 శాతం 0.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ గోల్డ్ 2 ఎంఎల్‌ను, ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా హెక్సాకోనోజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- బోరాన్ లోపం నివారణకు బోరాక్స్‌ను 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



బొర్రా కనకమహాలక్ష్మి, మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, నూజివీడు

క్లుప్తంగా

దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ


దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో బుధవారం దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపి నిర్వహించారు. డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ప్రతి రోజు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలన్నారు. దీనివల్ల పిల్లలు ఇతరులపై ఆధారపడకుండా సామర్ధ్యలు అభివృద్ధి చెంది తమ పనులు తాము చేసుకుంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, బి.నాగలక్ష్మి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణానికి చెందిన షేక్ నాగూర్ సాహేబ్ (77) ఛాతిలో నొప్పిగా ఉండటంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి బుధవారం వచ్చాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌నాగూర్ సాహేబ్‌ను పరీక్ష చేసిన అక్కడి వైద్యులు వెంటనే స్టంట్ వేయాలని చెప్పడంతో అతని బంధువుల వద్ద నుంచి పత్రాలపై సంతకాలు తీసుకుని స్టంట్ వేశారు. కొద్దిసేపటికి సాహేబ్ మృతి చెందడంతో అతని బంధువులు యూనియన్ ఆస్పత్రి వద్ద ఆందోళనకు చేశారు. వైద్య చికిత్స వికటించిన కారణంగానే నాగూర్ సాహేబ్ మృతి చెందాడని బంధువులు వైద్యులతో ఘర్షణకు దిగారు. పట్టణానికి చెందిన కొందరు పెద్దలు కలగచేసుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో మృతుని బంధువులతో ఆస్పత్రి వైద్యులు సమస్యను పరిష్కరించుకొన్నారు.

మున్సిపల్ స్వీపర్లకు వేతన బకాయిలు ఇవ్వాలి


మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

తణుకు: గత ఎనిమిది నెలలుగా స్కూల్ స్వీపర్ల వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వద్ద నిరసన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ స్వీపర్లకు ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 4 వేలు పెరుగుతున్న ధరలతో చాలడం లేదన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో మురళి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వీపర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.శారద, కార్యదర్శి కొంగరపు సత్యవతి, ధనలక్ష్మి, పి.లక్ష్మి, హేమలత, బంగారమ్మ, మహాలక్ష్మి, అర్జునమ్మ, భాగ్యలక్ష్మి, గార రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులు ఏర్పాటు

కాళ్ల: స్థానిక గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలను దాతలు బుధవారం బహూకరించారు. గనిశెట్టి సత్యనారాయణ ఝాన్సీ లక్ష్మిల కుమారుడు జానకి రామవెంకటసత్య నాగమల్లేశ్వర రావు, ఉషా నీరజ మనువడు శ్రీహాస్ ఉత్సవ మూర్తులను అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులతో వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

పిప్పళ్ల ప్రసాద్‌కు సత్కారం

భీమవరం (ప్రకాశం చౌక్): భారతదేశ శాస్త్రీయ సంప్రదాయ సంగీతాన్ని ఆరు దేశాల్లో చాటిచెప్పి విదేశీయుల సత్కారాలు పొంది తిరిగి స్వగ్రామం భీమవరంకు విచ్చేసిన ప్రముఖ సంగీత విద్వాంసులు పిప్పళ్ల ప్రసాద్ రావును శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, కార్యదర్శి కుక్కల బాల మాట్లాడుతూ దేశ విదేశాల్లో మన సంగీత కళను చాటి దేశానికి,పుట్టిన ప్రాంతానికి పిప్పళ్ల ప్రసాద్ ఏంతో గౌరవాన్ని తీసుకువచ్చారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నవంబర్ 11 నుంచి డిసెంబర్ 6 వరకు దక్షిణ ఆఫ్రికా, కెన్యా, యుగాండా, పంజనియా తదితర 6 దేశాల్లో ప్రసాద్ సంగీత, భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం పిప్పళ్ల ప్రసాద్‌ను స్వచ్ఛంద సంస్థలు కళాకారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, పోకాస్ నాటక పరిషత్ గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, చక్రవర్తి, ప్రజా నాట్య మండలి జిల్లా సభ్యులు ఎం.సీతారామప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

నందడిగా వైఏపీ నీడ్స్ జగన్


తాడేపల్లిగూడెం అర్బన్: 19వవార్డులో మాట్లాడుతున్న యువనేత కొట్టు విశాల్


పెంటపాడు: సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


తణుకు టౌన్: పైడిపర్రు 34వ సచివాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


తాడేపల్లిగూడెం రూరల్: నీలాద్రిపురంలో సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం


ఇరగవరం: రేలంగి-4 సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కొట్టు విశాల్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి నాడు-నేడులో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. నాడు ఆరోగ్యశ్రీ పెట్టి పేదలకు వైద్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆయన బాటలోనే జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా ఇంటి వద్దనే వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఇచ్చినా...ఇవ్వని ఎన్నో హామీలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. అయితే, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నేడు జగన్‌ను విమర్శించడం సరికాదన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తున్న సీఎం జగన్‌ను, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. తొలుత వైఎస్సార్‌సీపీ పతాకాన్ని, రూ.24,83,88,925లు విలువైన సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, ఎమ్పీటీసీ మట్టా సత్యనారాయణ, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మల్లిపూడి సుజాత, నాయకులు తలారి సీతారాముడు, పెదముత్తి ప్రేమ్‌కుమార్, కిర్లపాటి ప్రేమావతి, శివరామ్, ఆకుల ధనశేఖర్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శి తటవర్తి పవన్‌కుమార్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ రాష్ట్రం జగన్‌తోనే సాధ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని 2వార్డు ఇన్‌చార్జి కర్రి భాస్కరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ అవసరం ఎందుకు కార్యక్రమాన్ని బుధవారం స్థానిక 19వవార్డులో టౌన్ కన్వీనర్, 2వార్డు ఇన్‌చార్జి కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నియోజవర్గాన్ని అభివృద్ధి పథకంలో నడిపిస్తూ సమర్థనాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివ్యకుమారి, గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, నీరుకొండ శివప్రసాద్, సింగం సుబ్బారావు, రాజా త్రినాథ్, నీరుకొండ పండు, మిద్దే ఆదినారాయణ, వటి బుజ్జి, చామన సూర్యచంద్రరావు, మారిశెట్టి రమణ, పెంటపాటి సత్యనారాయణ, గురజాడ బ్రహ్మాజీ, పాబోలు వెంకటేష్, బొద్దాని శ్రీనివాస్, వంకా మోహన్, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, రజని, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్యలు పేర్కొన్నారు. పెంటపాడు మండలం పడమరవిప్పర్రు, ప్రత్తిపాడు గ్రామాల్లో బుధవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు బోణం వీరయ్య, వీర్ల గోవిందల ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో నిర్వహించారు. తొలుత గ్రామంలో సంక్షేమ అభివృద్ధిపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, పార్టీ నాయకులు బోణం వీరయ్యలు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు తరువాత సమూల మార్పులు వచ్చాయన్నారు. ప్రతి అర్హునికి ఇంటి వద్దకే ప్రభుత్వ పథకం చేరుతుందన్నారు. విప్పర్రు సొసైటీ అధ్యక్షుడు కలిరెడ్డి అబ్బాయి, పసల గంగా రామచంద్రన్‌లు మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ సందర్భంగా గృహసారథులకు, వలంటీర్లకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోకల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు యండ సరస్వతి, అప్పారావు, కామిశెట్టి ధనరాజు, కోడూరి నరసింహరావు, కోసూరి సుబ్బరాజు, మండల గృహసారథుల కన్వీనర్ మైలవరపు పెదబాబు, కార్యదర్శులు చక్రవర్తి, రామారావు, కార్యక్రమ కన్వీనర్ శివారెడ్డి, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తణుకు టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించామని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకు పైడిపర్రులోని 34వ సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలని అనే అంశంపై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతమైందన్నారు. కుల, మత, ప్రాంతీయ బేదం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ములగాల శ్రీనివాసు, నాయకులు రేలంగి రాంబాబు, కొత్తపల్లి చరణ్, వాజిరెడ్డి, యరబాటి రామకృష్ణ , ముప్పనపల్లి రాంబాబు, గారపాటి సత్యనాయణ, వార్డు కన్వీనర్లు కంచుమర్తి విశ్వేశ్వర రావు, సక్కింశెట్టి సరస్వతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

ఇరగవరం: నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగించారని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. మండలంలోని రేలంగి-4 సచివాలయ పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, రాబోయే 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, వైస్ ఎంపీపీ చీలీ మెంట రాజు, ఎంపీటీసీలు, మహలక్ష్మి, కిరణ్మయి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పులుపు అనిల్, రేలంగి సొసైటీ అధ్యక్షుడు నడుంపల్లి రాంబాబు రాజు, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, పులుపు సునీల్, ఈవోపీఆర్డీ నరసంహ మూర్తి, అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కార్యదర్శులు బి లక్ష్మి నారాయణ, కె సౌందర్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో, వాలీబాల్, టెన్నికాయిట్ ఇతర సాంప్రదాయ ఆటల పోటీలు జరుగుతాయన్నారు. సచివాలయ స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 వరకు, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకు, నియోజకవర్గ స్థాయిలో జనవరి 5 నుంచి 10వ తేది వరకు, జిల్లా స్థాయిలో 11 నుంచి 21వ తేది వరకు, రాష్ట్ర స్థాయిలో జనవరి 22 నుంచి 26వ తేది వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

విప్పర్రులో వికసిత్ భారత్

పెంటపాడు: మండలంలోని విప్పర్రు గ్రామంలో బుధవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఏపీలో బీజేపీ అమలు చేస్తున్న పలు పథకాలు వివరించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులకు సత్కారాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ రీజియన్ రివ్యూ మీట్ లయన్స్‌క్లబ్ హాల్‌లో బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. రీజియన్‌లోని 13 క్లబ్‌లు నుంచి అధ్యక్ష, కార్యదర్శి, చైర్‌పర్సన్‌లు హాజరైయారు. రీజియన్‌లోని క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. పలువురికి సత్కారాలు జరిగాయి. జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఎంఆర్ కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, చినబాబు, వీరవెంకట సత్యనారాయణ, ఉలుసు భాస్కరరావు, బండి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, వంగపండు రామ్మోహన్‌రావు, చిన్నంద జగదీష్, జీడిగుంట హరిబాబు, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాస్ రీజియన్‌లోని సభ్యులు పాల్గొన్నారు.

అత్తిలిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం


అత్తిలి ఎంపీయూపీ స్కూల్‌లో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ

అత్తిలి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపి, ప్రభుత్వం వారికి కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం అత్తిలి ఎంపీయూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్‌కి పంపాలన్నారు. ఈసందర్భంగా పాటలు, నృత్యాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంఈఓలు ఎస్ రమేష్, ఎంవీఎల్‌కే ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీపీ విజయ్‌కుమార్, ఆరవల్లి జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం బి ధనలక్ష్మిభూషణం, శ్రీకృష్ణమావుళయ్య, మండల ప్రత్యేక ఉపాధ్యాయులు జుత్తిగ ఏసురాజు, కె నాగరమ్య, కెఎస్ గట్టు పాఠశాల ఉపాధ్యాయులు కుమారిరామారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విజేతలకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న యోగ అధ్యక్షుడు వింజమూరి మాధవరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నిర్వహించిన నాల్గోవ స్టేట్ యోగాసనా ఛాంపియన్ షిప్ పోటీలు ఇటీవల జరిగాయి. తణుకు నుంచి కార్తికేయ ఉషా దుర్గకు ట్రెడిషనల్ యోగాలో మొదటి స్థానం గోల్డ్ మెడల్, ఆర్టిస్టిక్ సోల్ విభాగంలో మొదటి స్థానం గోల్డ్ మెడల్, భీమవరం నుంచి బి.ధనమాధవి రెండో స్థానం, జి.అరుణకుమారి, టి.రవీంద్రబాబులకు మూడో స్థానం, ట్రెడిషనల్ యోగాలో తాడేపల్లిగూడెం నుంచి బడుగు చంద్రశేఖర్‌లు నాల్గోవ స్థానం సాధించారు. విజేతలను బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వింజమూరి మాధవరావు, కోచ్ సీతారామయ్య, జిల్లా టీమ్ మేనేజర్ యు.వెంకటేశ్వరరాజు, సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చక్రధరరావు, గ్రంధి సత్యనారాయణ, కడియాల పరశురాం, మాకా శ్రీనివాస్‌లు రాష్ట్ర కోశాధికారి కరిబండి రామకృష్ణలు అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడేపల్లిగూడెం రూరల్: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు దీన స్వరూపారాణి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెండవ రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా దీన స్వరూపారాణి మాట్లాడుతూ తెలంగాణా కంటే అధనంగా వేతనాలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని తదితర పది డిమాండ్లను పరిష్కరించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభ రాణి, వరలక్ష్మి, బి.శైలజ, కే.కనకలక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు టీసీవై క్రిస్మస్ వేడుకలు

తణుకు అర్బన్: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తణుకు క్రిస్టియన్ యూత్ (టీసీవై) 24వ వార్షిక యూత్ క్రిస్మస్ వేడుక జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి నిర్వహించనున్నట్లు టీసీవై కన్వీనర్ మురాల సుధాకర్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభయ్యే ఈ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య ప్రసంగీకులుగా బిషప్ పి.నటరాజన్ లాజరస్ బైబిల్ ప్రసంగం, అంతర్జాతీయ సువార్త గాయకులు డాక్టర్ ఏఆర్ స్టీవెన్‌సన్ దైవగీతాలతో అలరిస్తారని చెప్పారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు హాజరవుతారని వివరించారు. విశ్వాసులంతా ఈ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

మోసపూరిత మాటలతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

తణుకు: తమ ఉత్పత్తులు వాడితే బరువు తగ్గుతారంటూ, వాటి కోసం డబ్బులు కట్టాలంటూ తణుకు పట్టణానికి చెందిన కొందరు మోసం చేస్తున్నారంటూ పిల్లి శ్రీశ్రీ అనే వ్యక్తి మంగళవారం రాత్రి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తణుకులో పలు ప్రాంతాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి మోసపూరిత మాటలతో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దిగువ మధ్యతరగతి కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఈ దందాపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలంటూ రెండో రోజు ధర్నా


ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కూడా ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను బలవంతంగా టీమ్ సర్వీసులకు పంపించడం మానుకోవాలన్నారు. ఈ ధర్నాలో మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సూర్యచంద్రరావు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, డిపో కార్యదర్శి ఎ.రవికుమార్, డిపో అధ్యక్షుడు కె.రవిశంకర్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


జిల్లా పాస్టర్ల క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ల సంఘ నాయకులు

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక శక్తిని విశ్వాసులు ప్రార్థనల ద్వారా పొందాలని జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కొమ్మిశెట్టి జాజిరాజు పేర్కొన్నారు. పడాల వాక్యజ్యోతి చర్చి ప్రాంగణంలో బుధవారం ఆ సంఘ ఐక్యక్రిస్మస్ వేడుకలు జిల్లా పాస్టర్ల సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన దైవసేవకులు కొండవీటి బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆధ్మాత్మిక సందేశం అందించారు. చిన్నారులు క్రిస్మస్ నాటికలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాపాస్టర్ల సంఘ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

గొల్లగూడెం సెంటర్‌లో :

గూడెంలోని గొల్లగూడెం సెంటర్‌లో యేసయ్య ప్రార్థనా మందిరంలో బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్ ఎజ్రా శాస్త్రి ఆధ్వర్యంలో పలువురికి ప్రేమవిందు ఏర్పాటు చేసారు. చిన్నారుల నాటికలు అలరించాయి.

మండపాకలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తణుకు టౌన్: తణుకు మండల పాస్టర్స్, ప్రీచర్స్ కుటుంబాల ఆధ్వర్యంలో వేడుకలు తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం మండపాక గ్రామంలోని ప్రవచన దేవుని సంఘం చర్చిలో నిర్వహించిన ఈ క్రిస్మస్ వేడుకల్లో తణుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వివిధ చర్చిల పాస్టర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వైజర్ ఎస్ సామ్యూల్, అసోసియేషన్ అధ్యక్షుడు పీడి ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షుడు వై సువర్ణరాజు, ఎస్ఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొడమంచిలి జాన్, పాస్టర్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఉండి: అదనపుకట్నం కోసం భర్త అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేయడంతో మహిళ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి ఇసుకదొడ్డి ప్రాంతానికి చెందిన సాలా సత్యవతికి పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన ప్రసాద్‌తో 2006లో వివాహమైంది. కొంతకాలం సంసార జీవితం సజావుగా సాగడంతో ఇద్దరు కుమార్తెలు కలిగారు. కొంతకాలం నుంచి రెండు లక్షల రూపాయలు అదనపు కట్నం తేవాలని లేదా ఇంట్లో ఉండొద్దని భర్త, అత్త, ఆడపడుచు, మరిది వేధించడంతో ఆమె ఉండిలోని పుట్టింటికి వచ్చేసింది. అనంతరం ఉండి పోలీసులకు సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఏఎస్సై ఏ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రీ సర్వేపై గ్రామ సభ

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రీ సర్వే పనులపై మండలంలోని వాంద్రం గ్రామంలో చివరి గ్రామ సభను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ అధ్యక్షతన బుధవారం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు.ఈ సభలో గ్రామ పరిధిలో నిర్వహించిన రీసర్వేపై నివేదికను చదివి వినిపించారు.అనంతరం ఎల్‌సీ (ల్యాండ్ పార్సిల్) నంబర్లపై రైతుల అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నవల్లి, గ్రామ సర్వేయర్ చిరంజీవి, వీఆర్వో ఎస్ చిన్నారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జేవీటీ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
- లిసిప్రియ

నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్గిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపూర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపూర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

> **నా నేరం ఏమిటి?**
> నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.
> – లిసిప్రియ, యాక్టివిస్ట్

> **యాక్ట్ నౌ**
> దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై, పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.
> 'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్
ఆషిక్



కుమారునికి వంట నేర్పితే?

ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.


తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నీషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కరకరలాడాలంటే...

కిచెన్‌టిప్స్



బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.

బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్



బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.

జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.





- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.

* హెల్త్ కేర్ నివేదిక



'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్‌ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్‌ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70-80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఈవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.